అకాల వర్షం.. అపార నష్టం!

- నాలుగు నెలలకు సరిపడా వర్షం.. నాలుగు గంటల్లోనే కురిసిన వైనం
- నీట మునిగిన పంటపొలాలు
- నేలపాడు రైతుల్లో ఆందోళన

తెనాలి టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నాలుగు నెలలకు సరిపడా కురవాల్సిన వర్షం.. నాలుగు గంటలోనే కురిసింది. దీంతో ఆరుగాలం కష్టించే రైతుకు అపార నష్టం వాటిల్లింది. ఇప్పటికే మూడుసార్లు వెదపెట్టి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూరల్ మండలం నేలపాడు గోలిడొంక శివారు ప్రాంతంలో అకాల వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను గురువారం రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. కనుచూపు మేరలో ఎటుచూసినా చెరువులను తలపించేలా వరి పొలాలు మంత్రి మనోహర్‌కు దర్శనమిచ్చాయి. నేలపాడు, ఐతానగర్‌కు చెందిన రైతులు ఇప్పటికే మూడుసార్లు వెద పెట్టి తీవ్రంగా నష్టపోయినట్లు మనోహర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.30 వేలు కౌలు చెల్లించి.. రూ.15 వేలు పెట్టుబడి పెట్టినట్లు వెల్లడించారు.

రైతులకు న్యాయం చేయాలి..

రెండు, మూడు రోజుల్లో నీళ్లు బయటకుపోకుంటే నాలుగో దఫా వెద పైరు వేసుకోవాల్సి వస్తోందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమగ్రంగా పంట నష్టం అంచనా వేసి న్యాయం చేయాలని వారు మంత్రిని కోరారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. తెనాలి మండలంలో 17 వేల ఎకరాల్లో రైతులు వెద సాగు చేపట్టినట్లు చెప్పారు. దీనిలో 14 వేల ఎకరాలు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నట్లు తెలిపారు. 7 వేల మంది రైతులు పంటనష్టం భారిన పడ్డారన్నారు. విత్తనాలు ఉచితంగా ఇచ్చే ఆలోచన చేస్తామని రైతులకు భరోసానిచ్చారు.


నేలపాడులో నీట మునిగిన వరి పొలాలు


ముంపు పొలాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర మండలంపై ప్రత్యేక దృష్టి..

కొల్లిపర మండలంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి మనోహర్ అన్నారు. గురువారం రాత్రికి కృష్ణానది ప్రవాహం అధికంగా ఉంటే లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తామని తెలియజేశారు. తెనాలి పట్టణంలో ఉచిత మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. వరద ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సబ్ కలెక్టర్ సంజనా సింహాకు సూచించారు. గోలిడొంక రహదారి నిర్మాణాన్ని సెప్టెంబరు 15 లోపు ప్రారంభించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావును ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, ఉద్యానవనశాఖాధికారి యు.శ్రీనిత్య, హెల్త్ ఆఫీసర్ మువ్వా యేసుబాబు, విద్యుత్ డీఈ బోరుగడ్డ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలి అర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 4వ వార్డు బుర్రిపాలెం రోడ్డులోని పెట్రోల్ బంకు పక్క వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మట్టి రోడ్డు కావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ వచ్చారని తెలిపారు. కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు రోడ్డు నిర్మించాలని కోరారని.. దీంతో రోడ్డు నిర్మాణం కోసం రూ.13 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, డీఈ శ్రీనివాసులు, ఏఈ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని.. వాతవరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జి.సిద్ధార్థ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా నది వరదల కారణంగా నదిలోకి ఎవరూ చేపల వేటకు, నదీ స్నానానికి వెళ్లరాదని అన్నారు. భారీ వర్షాల కారణంగా ఆస్తి, పశు, ప్రాణ నష్టాలు జరిగే అవకాశాలు ఉంటాయని.. అలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ప్రజలు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో 24గంటల పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. 99085 68006 నంబరుకు సమాచారం అందించిన వెంటనే అధికారులు మీ వద్దకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తారని ఆయన ఆ ప్రకటలో పేర్కొన్నారు.

సమరయోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి


సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

తెనాలి టౌన్: నేటి యువత స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐతానగర్‌లోని సుభాష్‌చంద్రబోష్ విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా ఘర్ ఘర్ తిరంగా చేస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గాంధీజీ, సుభాష్‌చంద్రబోసు వంటి మహనీయుల జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోళ్ల దేవరాజు, కఠారి వాసుదేవనాయుడు, ఎస్.రవీంద్ర, కడియాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి అర్బన్: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అందరూ కలిగి ఉండాలని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ.షీలా పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను పట్టుకుని 'భారత మాతకు జై' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు వి.కాత్యాయని, పి.ఇందు, కె.అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్మాష్టమి వేడుకలు రేపు

తాడేపల్లి రూరల్: నులకపేట చైతన్య తపోవన్‌లో శ్రీ కృష్ణ జన్మదినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ మాతా శివానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు బాలభోగం.. 9 గంటలకు చిన్నారులతో గోపీ కృష్ణ వేషధారణ.. 10 గంటలకు శ్రీ రాధాకృష్ణులకు పంచామృతాభిషేకం, 108 పద్మ పుష్పాలతో అర్చన ఉంటుందన్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ జరిగే పలు కార్యక్రమాలను తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నీట మునిగిన పంటలను కాపాడుకోవాలి

తెనాలి టౌన్: అధిక వర్షాలకు నీట మునిగిన వరి పైరును కాపాడుకోవడానికి సత్వరం పొలంలోని నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం రూరల్ మండలం హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాల్లో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. పైరు 5 రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ 5 రోజుల లోపే నీటిని పూర్తిగా బయటకు తీసి లీటర్ నీటికి ఒక గ్రాము కార్బండేజిల్ లేదా 2 గ్రాముల కార్బండేజిల్, మాంకోజెబ్ కలిపిన మిశ్రమ మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. నీరు బయటకు వెళ్లేలా పొలంలో బాటలు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీవీఎస్ గోపాలస్వామి, డాక్టర్ ఎం.వెంకటరాములు, వీఏఏ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటలక్ష్మి

వర్షపు నీరు బయటకు పంపేలా చర్యలు

తెనాలి అర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించార. చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న మ్యాన్‌హోల్స్‌ను పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. అలాగే రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టారు. అల్పపీడనం నేపథ్యంలో తెనాలి పురపాలక సంఘంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏవైనా సమస్యలు తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్ 1800 4256 468కు కాల్ చేయాలని సూచించారు. అల్పపీడన ప్రభావం తగ్గే వరకు కంట్రోల్ రూమ్ కొనసాగుతుందన్నారు.


షీల్ట్ పనులను పరిశీలిస్తున్న లక్ష్మీపతిరావు

తాడేపల్లిలో 36.8 మి.మీ. వర్షపాతం..

తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తాడేపల్లిలో 36.8 మి.మీ. వర్షపాతం నమోదైందని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఈఈ బోరుగడ్డ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టార్టర్లు, మోటార్లు, స్విచ్‌బోర్డుల జోలికి వెళ్లవద్దని ఆయన సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే తమకు తెలియజేయాలన్నారు.

4వ రోజుకు చేరిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి నిరాహార దీక్ష

తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.పద్మావతి చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. గుంటూరు జీఎం, ఎస్‌డీఈ ఫోనులో పద్మావతిని పరామర్శించి దీక్షను విరమించాలని కోరారు. ప్రవేటు ఏజెన్సీ వాళ్లను టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఖాళీ చేసి బయట సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని.. సంబంధిత హామీ ఇస్తే తాను దీక్ష విరమిస్తానని పద్మావతి స్పష్టం చేశారు.

నాటకంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి చరిత్ర



తెనాలి: ఆర్యవైశ్యుల కుల దైవం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్రపై రూపొందించిన భక్తిరస పద్యనాటకం ప్రేక్షకుల అభినందనలను అందుకుంది. పట్టణానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు, స్వర్గీయ దీపాల సుబ్రహ్మణ్యం స్థాపించిన నాటక సమాజం .. శ్రీవిజయలక్ష్మి శ్రీనివాస నాట్యమండలి భక్తిరస నాటక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించింది. ఈ నాటక సమాజం గురువారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి చరిత్ర' నాటకాన్ని ప్రదర్శించారు. సురభి కళాకారులు రూపొందించిన భారీ సెట్టింగులు, కళ్లు చెదిరే రంగాలంకరణ కనువిందు చేశాయి. మొత్తం 25 మంది కళాకారులు పాత్రోచితంగా నటించారు. కన్యకాపరమేశ్వరిగా తెనాలి జ్యోతి నటించారు. ఇతర పాత్రల్లో గోపి, ఎస్.కొండలరావు, ప్రసాద్, దీపాల సత్యనారాయణ, సుబ్బారావు, తులసి, స్వామి, సాంబయ్య నటించారు. నటీనటులు పాత్రోచితంగా నటించారు. హార్మోనియం సహకారం శ్రీను, సెట్టింగ్స్ సురభి సంతోష్ తొలుత పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, గ్రీన్ ఫౌండేషన్ అధినేత గుంటి వెంకట్‌లు జ్యోతి ప్రజ్వలన చేశారు. దివంగత దీపాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చందు సుబ్బారావు, గోపీచందు, పలువురు కళాకారులు పాల్గొన్నారు. నిర్వహణగా దీపాల తారకసాయినాథ్ వ్యవహరించారు.

ముంపు పంటలకు ఎన్యూమరేషన్ చేయాలి



తెనాలి: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా మునిగిన పంట పొలాలకు వెంటనే ఎన్యూమరేషన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం, ఉచితంగా విత్తనాలను కౌలు రైతులకు ఇవ్వాలని ఆయన అన్నారు. ఖాజీపేట, కొలకలూరు, నందివెలుగు, అత్తోట గ్రామాల్లో నీట మునిగిన పంటలను గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతుల సంఘాలు పర్యటించాయి. ఈ సందర్భంగా నాయకులు నీట మునిగిన చేలకు సంబంధించిన రైతులు, కౌలురైతులతో మాట్లాడారు. ఇప్పటికే రెండు సార్లు వరి విత్తనాలను వెదజల్లామని.. ఎకరానికి రూ.12 వేల వరకు పెట్టుబడులు పెట్టామని రైతులు రైతునేతల దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు మునిగిన పంటలను ఎన్యూమరేషన్ చేయాలని మాగంటి హరిబాబు కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ.. రైతులను ఆదుకునేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అత్తోట సర్పంచ్ దేశబోయిన పూర్ణేశ్వరరావు, ఆలా నాగరాజు, ఉదారపు రామయ్య వెంకట కోటేశ్వరరావు, నగుళ్ల హరిప్రసాద్, తుల్లిమిల్లి నాగేశ్వరరావు, దేశబోయిన శ్రీనివాసరావు, తుల్లిమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యురాలకు రోడ్డే ఆవాసం!



తెనాలి: ఓ అభాగ్యులు పట్టణంలో మతిస్థిమితం లేకుండా సంచరిస్తోంది. రాత్రింబవళ్లు రోడ్లపైనే కాలక్షేపం చేస్తుండడం చూసేవారికి దయనీయంగా అనిపిస్తోంది. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల, ఆర్ఆర్ ఫర్నిచర్స్ పరిసర ప్రాంతాల్లోనే ఆమె తిరుగుతూ కాలం గడుపుతోంది. ఎవరికైనా పాపం అనిపించి ఏదైనా తినడానికి సాయం చేసినా తీసుకోదని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తన్నీరు శివశంకర్ తెలిపారు. గతంలో స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో 'ఆశ్రయ' వార్డు పదేళ్ల పాటు నడిచింది. ఇలా రోడ్లపై తిరిగే మతిస్థిమితం లేని వారిని తీసుకువెళ్లి ఆశ్రయమిచ్చేవారు. భోజనం అందిస్తూ వారిలో మానసిక పరివర్తనకు కృషి చేసేవారు. ప్రస్తుతం నిర్వాహకులు లేక ఆశ్రయం మూతపడింది. ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఆ యువతిని మరెక్కడైనా గల ఆశ్రమానికి తరలించాలని పలువురు సూచిస్తున్నారు.